
ప్రజాశక్తి
మంగళవారం 9 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం



12న జట్టు ఆశ్రమంలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఈనెల 12న పార్వతీపురం జట్టు ఆశ్రమ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు వి.పద్మజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువ దినోత్సవం సందర్భంగా ఆరేళ్ళు దాటిన బాల బాలిక నుండి డిగ్రీ విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం, పిండి వంటలు పోటీలు, పరిసరాల శుభ్రత, వ్యక్తిగత బాధ్యత, వ్యర్థాల నిర్వహణ అన్న అంశంపై ఈ ఉంటుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే యువతీ యువకులు ఈనెల 11 లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రకటనలో కోరారు.


కలెక్టరేట్ వద్ద బైఠాయించిన మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరిస్తేనే సమ్మె విరమణ

కలెక్టరేట్ వద్ద మున్సిపల్ కార్మికుల బైఠాయింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిష్కరిస్తేనే సమ్మెను విరమిస్తామని లేనియెడల కొనసాగిస్తామని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు, ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగం ఔట్సోర్సింగ్ కార్మికులు హెచ్చరించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ అధ్యక్షులు నాగవంశం శంకరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కోశాధికారి జి.వెంకటరమణ ఆధ్వర్యాన సోమవారం పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, ఆప్కాస్, ఇంజనీరింగ్, వాటర్ వర్కర్స్, విద్యుత్ విభాగ కార్మికులు స్థానిక పాతబస్టాండ్ నుంచి ప్రధాన రహదారి గుండా బెలగాంలో ఉన్న కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. అనంతరం అక్కడ బైఠాయించి నిరసన తెలుపుతూ జెసి గోవిందరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ ఎంఎల్ నాయకులు భాస్కరరావు, సిపిఎం ఎం ఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పి.రమణి, బి.నరసింహారావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు సంఘం, రైతు కూలీ సంఘం నాయకులు విశ్వేశ్వరరావు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. సమ్మె కారణంగా తాగునీరు, పారిశుద్ధ్య వీధి దీపాలు వంటి సమస్యలపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రజలకు కోట్లాది రూపాయలు నిధులను అందజేస్తున్న ఎపి జగన్మోహన్ రెడ్డి తమ సమస్యల పరిష్కారానికి చొరవచూపకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించకపోతే సమ్మె విరమించేది లేదని అన్నారు. కార్యక్రమంలో సాలూరు, పార్వతీపురం, పాలకొండ మున్సిపాలిటీల్లో వీరు నిర్వహిస్తున్న కార్మికులతో పాటు బీపురపల్లి సింహాచలం, నాగవంశం మల్లేష్, మామిడి శివ, బంగారి రాజేష్, బంగారి రవి, నాగవంశం పాపులమ్మ, నాగవంశం నిర్మల, కృ, తాడ్డి వినయ్, తాతబాబు, క్రాంతి, చిన్ని కృష్ణ, గణపతి, బాల,శంకరరావు, మేడిశెట్టి కృష్ణ, పాలకొండ రంజిత్, ఉమా, టి.ఇందు, టి.శంకర్రావు, రవి, టి.రాముడు, పి.వేణు, కార్మికులు అధిక పాల్గొన్నారు.

సంక్రాంతికి వారం ముందే ట్రాఫిక్ జామ్

- కిటకిటలాడుతున్న బట్టల షాపులు
- బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లని లారీలు
- పట్టణంలో కి ప్రవేశంతో ఇబ్బందులు


పట్టణ ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - సాలూరు

సంక్రాంతి పండుగకు వారం రోజుల ముందు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అసలే ప్రధాన రహదారి ఇరుగ్గా ఉండడం, వాహనాల రాకపోకలు పెరగడంతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోయే పరిస్థితి నెలకొంది. బోసుబొమ్మ జంక్షన్ నుంచి వెంకటేశ్వరా డీలక్స్ సెంటర్ వరకు ప్రధాన రహదారి ఇరుగ్గా ఉంటుంది. ఈ మార్గంలోనే ప్రధానమైన బట్టల షాపులు, కిరాణా దుకాణాలు ఉన్నాయి. సంక్రాంతి మరో వారం రోజుల్లో వస్తుందనగానే షాపులన్నీ కిటకిటలాడుతున్నాయి. షాపులకు వచ్చే జనం వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. షాపుల వద్ద పార్కింగ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో రోడ్డు మీదనే వాహనాలు పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

పట్టణంలోకి లారీలు

అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలకు వెళ్లే లారీలు, ఇతర భారీ వాహనాలు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాల్సి వుంది. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తోంది. అధికారికంగా దాన్ని ప్రారంభించకపోయినా అనధికారికంగా వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో ఒడిశా, ఛత్తీస్ఘడ్ వెళ్లే వాహనాలు బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లిపోవాలి. కానీ ఇంకా పట్టణంలోకి లారీలు ప్రవేశిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లలో ప్రయాణించేవారు. ఆర్టీసీ ప్రయాణికులకు తీవ్రమైన అసౌకర్యం కలుగుతోంది. ప్రధానంగా మండలంలోని క్వారీల నుంచి రాకపోకలు సాగించే వాహనాలు ఎక్కువగా పట్టణ నడిబొడ్డు మీదుగా వెళ్తున్నాయి. దీని వల్ల కూడా ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. సంక్రాంతి పండుగ కావడంతో దూరప్రాంతాల నుంచి పెద్దఎత్తున కార్లలో బంధువులు పట్టణం, ఇతర గ్రామాలకు వస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

బైపాస్ జంక్షన్ ల్లో ట్రాఫిక్ పోలీసులేరీ?

ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల నుంచి సాలూరు వైపు, ఇటు నుంచి అటు వైపు వెళ్లే వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించేందుకు బైపాస్ జంక్షన్ల్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాల్సి ఉంది. కానీ ఇంతవరకు పోలీస్ శాఖ దీనిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. కెవిఆర్ రియల్ ఎస్టేట్కు ఎదురుగా, జీగిరాంకు ముందు బైపాస్ జంక్షన్లో ట్రాఫిక్ పోలీసులను నియమించాల్సి ఉంటుంది. అప్పుడే పట్టణంలోకి భారీ వాహనాలు, లారీలు ప్రవేశించే అవకాశం ఉండదు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తా : జిడి బాబు, టౌన్ సిఐ

పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారిస్తా. లారీ యజమానులు, ఆటో డ్రైవర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను నియమిస్తాం. అందుబాటులో వున్న సిబ్బందితో సమస్యలు పరిష్కరిస్తా.

ఆయుష్మాన్ భారత్ ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద పివిటిజిలను నమోదు చేయాలని, ఇకెవైసి చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. మండలంలోని బందిదొరవలసలో ఆయుష్మాన్ భారత్ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పివిటిజిల నమోదు, ఇకెవైసి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత యాప్లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ యాప్లో నమోదైన వారికి ఆయుష్మాన్ భారత్ కార్డు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆకిబ్ జావెద్, పంచాయతీ సెక్రటరీ, సంక్షేమ సహాయకులు పాల్గొన్నారు.

లెక్కింపు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాబోయే ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటుకు అవకాశాలను ఉద్యాన కళాశాలలో ఎస్పి విక్రాంత్ పాటిల్తో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సోమవారం పరిశీలించారు. అందుబాటులో ఉన్న గదులు, లెక్కింపు కేంద్రం ఏర్పాటుకు అనుకూలంగా ఉండే గదులు, పార్కింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, ఉద్యాన కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.


లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్కుమార్, ఎస్పి విక్రాంత్పాటిల్

చదురుగుడిలోకి పోలమాంబ

జాతర షురు... నేడు రెండో సమీక్షా సమావేశం

ప్రజాశక్తి -మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత పేరుంది రాష్ట్ర జాతరగా అవతరించిన శంబర పోలమాంబ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సోమవారం రాత్రి వనం గుడి నుండి గ్రామంలో గల చదురు గుడిలోకి తీసుకొచ్చారు ఆలయ కార్యనిర్వహణాధికారి వివిఎస్ నారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇప్పటి నుంచి ఈనెల 22, 23, 24వ తేదీల్లో పాలమాంబ మొదటి వారం జాతర ఘనంగా జరగనుంది. మరల అమ్మవారిని రెండో వారం నుండి 10 వారాల పాటు వనం గుడిలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు 9 వారాల పాటు ఇక్కడే జాతర జరగనుంది సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి స్థానిక గ్రామ పెద్దలు ఎంపిటిని సభ్యులు పోలినాయుడు, జన్నిపేకాపు కుటుంబ సభ్యులు, గెరడ కుటుంబీకులు పాల్గొన్నారు


అమ్మవారిని చదురుగుడిలోకి తీసుకొస్తున్న భక్తులు

నేడు రెండోవిడత సమీక్ష

శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు సంబంధించి పార్వతీపురల్లి ఆర్డీవో హేమలత ఆధ్వర్యంలో మంగళవారం సమీక్ష సమావేశం జరగనుంది. ఈ సమీక్షకు అన్ని శాఖల అధికారులు పాల్గొనన్నారు. జాతర ఏర్పాట్లకు సంబంధించి ఈ సమీక్షలో చర్చించనున్నారు. చదురు గుడి సమీపంలో జరిగే ఈ సమావేశానికి అందరూ విధిగా హాజరుకావాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి వివిఎస్ నారాయణ కోరారు.

ఐటిడిఎలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - సీతంపేట

భామిని మండలం లో పనిచేసేందుకు నీతిఅయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో ఉద్యోగాలకు సోమవారం ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఒక పోస్టుకు 8మంది దరఖాస్తు చేసుకోగా, 7 గురు అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి పీవో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం జిల్లా సిపిఒ, డిఎస్ఒ తదితరులు పాల్గొన్నారు.


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సోమవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ కె.ఉజ్వల్ ఆధ్వర్యంలో యువతకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్న కళాశాల విద్యార్థినిలకు ఎస్ఐబి సిఐ ఉపేంద్ర, డివిఇఒ మంజులవాణి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు పైడాన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు, తొలగింపులకు లొంగేది లేదు

కొనసాగుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులను తొలగించి, సమ్మెను అణిచివేయాలని ప్రభుత్వం అధికారుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతుందని, అయినా తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ లొంగేదిలేదని ఎస్ఎస్ఎ ఉద్యోగుల జెఎసి నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో వారు చేస్తున్న నిరసన సోమవారం 20వ రోజు విజయవంతంగా కొనసాగించారు. కార్యక్రమంలో భాగంగా సమ్మె శిబిరం వద్ద ఒంటి కాళ్లపై నిల్చొని దండం పెడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు బివి రమణ, ఎం.ఈశ్వరరావు, కాంతారావు తదితరులు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖ పరిధిలోని 18 విభాగాల ఉద్యోగులు గత 20 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలపై సానుకూలంగా స్పందించకపోవడం విచారకరమని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, మినిమం టైం స్కేల్ వంటి సమస్యలను పరిష్కరించాలని, ధరల పెరుగుదలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గత 20 రోజులుగా ఏవిధమైన పురోగతి లేకుండా మొండిగా, నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సరైన విధానం కాదని విమర్శించారు. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకటించిన హెచ్ఆర్ పాలసీకి సంబంధించి తక్షణమే జీఓ విడుదల చేయాలని, 23శాతం జీతాలు పెంచుతామన్న హామీ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు శంకర్రావు, ఆచారి శాంతకుమారి, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శం..అంగన్వాడీల పోరాటం

- ప్రతిపక్షాలు సంఘీభావం
- 28వ రోజు కొనసాగిన సమ్మె
- పలుచోట్ల వినూత్న నిరసనలు


నిరవధిక సమ్మెనుద్దేశించి మాట్లాడుతున్న టిడిపి నాయకులు జగదీష్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సంఖ్యాబలం ఉందనే మదంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ, ప్రజల సమస్యలను పక్కన పెడుతూ నియంతల్లా ప్రవర్తిస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులకు అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె కనువిప్పు కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది అంగన్వాడీలు 28 రోజులుగా చేస్తున్న సమ్మెను అణచివేయడానికి ఎస్మా చట్టాన్ని వారిపై ప్రయోగించిన ప్రభుత్వ దమననీతికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్షాలు వారికి అండగా నిలబడి పోరాటానికి సంపూర్ణ మద్దతు పలికాలి. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.సరళకుమారి, సిఐటియు నాయకులు బి.లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష శిబిరానికి తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ (ఎమ్ ఎల్) సిపిఐ (ఎం ఎల్) న్యూ డమోక్రసి, సిపిఐ (ఎమ్ ఎల్) లిబరేషన్ రైతుకూలి సంఘం, ఎఐసిసిటియు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు హాజరై తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. తొలుత టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక వర్గాలతో పాటు వేతన జీవులందర్నీ మోసగించారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరిన పాపానికి అంగన్వాడీలపై అణచివేత చర్యలు చేపట్టి ఒక నియంతలా ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ దాదాపు నెల రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా ఎస్మా వంటి చట్టాలను మహిళలపై ప్రయోగించి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు అంగీకరించరని అన్నారు. మరి కొద్ది రోజుల్లో టిడిపి అధికారంలోకి రానుందని, వచ్చిన తర్వాత అంగన్వాడీల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తామని ఇప్పటికే తమ అధినేతలు చంద్రబాబు, లోకేష్ తెలియచేశారని తెలిపారు. అనంతరం వామపక్ష పార్టీలతో పాటు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తుందని, న్యాయమైన కోర్కెలను పరిష్కరించమని అంగన్వాడీలతో పాటు ఇతర రంగాలు కూడా చేస్తున్న సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాజెక్టుల నుంచి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు నిరాహార దీక్షలో పాల్గొనగా, పార్వతీపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బోనెల విజయచంద్ర, కౌన్సిలర్ తాతపూడి వెంకటరావు, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు మోణంగి భాస్కరరావు, పి,రమణి, బి.నరశింగరావు, సంగం, అజ్జరాపు దామోదర్, విశ్వేశ్వరరావు, పాకల సన్యాసిరావు సంఘీభావం తెలిపారు.

కొమరాడ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సమ్మెలో భాగంగా స్థానిక జెడ్పి హైస్కూల్లో ఉన్న గాంధీ విగ్రహానికి అంగన్వాడీలు వినతిపత్రం అందజేసి తమ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ నిరసన తెలిపారు. అనంతరం జిఒ 2 ప్రతులను రద్దు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరితే ప్రభుత్వం మొండిగా వ్యవహరించి ఎస్మా ప్రయోగించడం పట్ల అంగన్వాడీలు రోజుకొక రీతిలో నిరసనలు తెలియజేస్తూ సమ్మె కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే గుమ్మలక్ష్మీపురంలో సమ్మె చేస్తున్న అంగన్వాడీలు సోమవారం మెడకు ఉరి తాళ్లు బిగించుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు సత్యవతి మండిపడ్డారు. కార్యక్రమంలో కార్యదర్శి కస్తూరి ఉన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నాటికి అంగన్వాడీల సమ్మె 28వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా అంగన్వాడీలంతా ఒంటి కాలిపై నిల్చొని దండాలు పెడుతూ జగన్మోహన్రెడ్డి గోవిందా గోవిందా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వై.రామారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్.శైలజ, ఎస్.సునీత, ఆర్.లక్ష్మి, డి.అరుణ, ఎం.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట జరుగుతున్న అంగన్వాడీల నిరధిక సమ్మెను ఉద్దేశించి సిఐటియు సీనియర్ నాయకులు ఎ.భాస్కరరావు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన ప్రజాస్వామికమైన పోరాటంపై ఎస్మా లాంటి దుర్మార్గమైన అస్త్రాన్ని ప్రయోగించడం ఆటవిక చర్యన్నారు. కారంంంయ్రక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సురేష్, ఎం. కాంతారావు, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

పాచిపెంట : స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు నాయకులు ఎం.బంగారమ్మ, పైడిరాజు, సాయి, పూజ, బేగం, సుగుణమ్మ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 2 కాపీలను దగ్ధం చేశారు. వీరికి మద్దతుగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు , అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు. చట్ట వ్యతిరేకంగా అంగన్వాడీలకు వర్తించని, ఎస్మా చట్టం జిఒ2 ను తక్షణ ఉపసహరించుకోవాలని, 28వ రోజు సమ్మె చేస్తున్నా సమస్య పరిష్కరించకుండా నిర్బంధం ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుంటే తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పడుతుందని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ హెచ్చరించింది.


సాలూరులో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


బలిజిపేటలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు


ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవిస్తున్న అంగన్వాడీలు

మా బాధలు పట్టవా..? : ఎమ్మెల్యేను నిలదీసిన అంగన్వాడీలు

గరుగుబిల్లి : తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ 28రోజులుగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వానికి పట్టడంలేదానని కురుపాం ఎమ్మెల్యే పుష్ప-శ్రీవాణిని అంగన్వాడీలు నిలదీశారు. సోమవారం వైయస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండలానికి వచ్చిన ఎమ్మెల్యే కారును నిలిపి వేసి తమ న్యాయమైన డిమాండ్లపై ముఖ్యమంత్రి నోరు మెదపకపోవడం, ఎమ్మెల్యేలైనా మా న్యాయమైన సమస్యలను సిఎంకు చేరేలా చర్యలు చేపట్టాలని అంగన్వాడీలు వినతి అందజేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే జీతాలు కన్నా వెయ్యి రూపాయలు అధికంగా ఇస్తామని మాట ఇచ్చిన జగనన్న మరిచినట్లు మమ్మల్ని నడివీధిలో పెట్టినవ్వుల పాలు చేస్తున్నట్టు అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు. మాట తప్పని మడం తిప్పని నాయకుడని నమ్మి గెలిపించినందుకు సరైన బుద్ధి చెప్పారని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు గౌరమ్మ, పెదగుడబ సెక్టార్ నాయకులు సావిత్రి, రావుపల్లి లక్ష్మి, సత్యవతి, పద్మ, అరుణ, ఎం.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమాప్రభ, జె.జెస్సీబాయ్, జి.శారద, లలిత, దివ్య, నిర్మల, భవాని, శ్రీదేవి నాయకత్వం వహించారు.

బలిజిపేట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద అంగన్వాడీలో చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం పోర్లు దండాలు పెడుతూ సోమవారం నిరసన తెలిపారు. మహిళా పక్షపాత ప్రభుత్వమని చెప్పి నేడు మహిళలపై ఇటువంటి అరాచక పాలన కొనసాగించడం సరైన పద్ధతి కాదని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీలో తదితరులు పాల్గొన్నారు

సాలూరు: అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 28రోజుకి చేరింది. సోమవారం గడ్డి తింటూ అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు నిరసన శిబిరం వద్ద ఆందోళన చేపట్టారు. యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.ఇందిర శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని చెప్పారు. ఎస్మా చట్టం ప్రయోగిస్తూ బెదిరింపులకు దిగుతోందని అన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా వీరేష్ చంద్ర దేవ్

ప్రజాశక్తి - కురుపాం

తెలుగుదేశం యువనేత వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్‌ను రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ఈ మేరకు టిడిపి కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకం పట్ల ఆనందం వ్యక్తం చేసిన ఆయన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పదవి తనలో మరింత బాధ్యత పెంచిందని, జిల్లా పెద్దలు, సీనియర్లు, నాయకుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉండడంతో పాటు వైసిపి ప్రభుత్వ దుర్మార్గాలు, ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తానని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కీలకంగా కృషి చేస్తానని అన్నారు.



చంద్రబాబును కలిసిన వీరేష్ చంద్రదేవ్

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ముఖి సూర్యనారాయణ



పాచిపెంట : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ నియోజకవర్గాలకు చెందిన 9మందిని టిడిపి కార్యదర్శులుగా నియమించారు. అందులో సాలూరు నియోజకవర్గం పాచిపెంట మండలం మాతుమూరుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు ముఖి సూర్యనారాయణను కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి, మండల నాయకులతో కలిసి సోమవారం సూర్యనారాయణ స్వగ్రామం మాతుమూరు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

చిన్న భోగిలిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చిన్న భోగిలి పంచాయతీ పరిధిలో సర్పంచ్ కుర్మాన రాధా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు సోమవారం చేపట్టారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధుల్లోనూ పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. ప్రజలు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోహర్‌తో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

11న సుబ్బమ్మ పేరంటాల ఉత్సవం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటలో ఈనెల 11న సుబ్బమ్మ పేరంటాలు జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ కణ్యంపూడి సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కాకుండా గ్రామంలో ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు సంఘం తరుపున స్థానిక ఐటిడిఎ పిఒకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రగిరి పిటిజి బాలికల పాఠశాలకు రెగ్యులర్ మహిళా ప్రిన్సిపల్‌ను నియమించాలని కోరారు. అలాగే సీతానగరం మండలం జోగింపేటలోని గిరిజన ప్రతిభ పాఠశాల/కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని కోరారు. గిరిజన గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్వతీపురంలోని ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి గాయాలపాలయ్యి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని పిఒను కోరారు.

'ఆడుదాం ఆంధ్ర'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

మండల స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను జయప్రదం చేయాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు, పిఇటిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ త్వరలో మండల స్థాయి క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మండల స్థాయికి 91 టీములు ఎంపికైనట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. కాబట్టి ఇప్పటికే క్రీడాకారులకు మండల స్థాయి ఏ తేదీల్లో ఏఏ టీములకు పోటీలు నిర్వహిస్తామన్న సమాచారాన్ని ముందుగా తెలియజేయాలని తెలిపారు. సమావేశంలో ఎంఇఒలు జామి నారాయణస్వామి, తిరుపతి నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహిళకు పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

మళ్లీ ఆదరించండి : రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఆదరించి వైసిపి ప్రభుత్వానికి పట్టం కట్టాలని డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర అన్నారు. సోమవారం మక్కువలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లవీధి, నీలి వీధి తదితర వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, మండల వైసిపి నాయకులు రంగు నాయుడు, సాలూరు సిఐ ధనుంజయరావు పాల్గొన్నారు.

సొంత స్థలాలకు గృహాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం



హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లత దంపతులను సత్కరిస్తున్న కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

సొంత స్థలాలు ఉన్నవారికి గృహాలు మంజూరు చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భోగి లత రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ డి.దొరబాబు, మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీశాకు సోమవారం విజయవాడ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సొంత స్థలాలున్నవారు గృహాలు నిర్మించు కొనేందుకు అవకాశం ఉన్నప్పటికీ గృహాలు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. . రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భోగి లత పదవీకాలం కొనసాగించాలని ఉత్తర్వులు రావడంతో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లతో పాటు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భోగి లతా, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్‌కు శాలువాతో ఘనంగా సన్మానించారు.

వినతులకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్పందనలో ప్రజలు పెట్టుకొనే అర్జీలకు వారు సంతృప్తి చెందేలా సరైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, కెకెఆర్‌సి ఎస్‌డిసి జి.కేశవనాయుడుతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్పందనలో 211 అర్జీలను ప్రజలు అందజేశారు. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతానగరం మండలం తుమరాడ గ్రామానికి చెందిన గొల్ల రామునాయుడుకు వినికిడి మిషన్, పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామానికి చెందిన జి.పైడయ్యకు, బలిజిపేట మండలం గౌరీపురానికి చెందిన ఎస్.వాసుదేవరావు, జియ్యమ్మవలసకు చెందిన రాయల సత్యనారాయణకు ట్రై సైకిళ్లను జెసి, ఐటిడిఎ పిఒ అందజేశారు.

ఐటిడిఎలో....

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో పిఒ కల్పనకుమారి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు వచ్చిన వినతుల్లో కొన్ని... కొడుమసింగికి చెందిన



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

ఉపాధ్యాయు హాస్టల్ వసతి కల్పించాలని కోరారు. బెల్లమడుగు చెందిన పాలక జయ అమ్మఒడి డబ్బులు ఇప్పించాలని, దాపాకులగూడకు చెందిన నాగేశ్వరరావు వివికలాంగ నిరుపేదకు స్థలం మంజూరు చేయాలని కోరారు. నేలబొంతకు చెందిన ఆరుద్ర రోడ్డు పనులు పూర్తి చేయాలని, రింపి గ్రామానికి చెందిన నారాయణరావు సబ్సిడీకి ఆటో మంజూరు చేయాలని, కొత్తగూడెం చెందిన ఎలుకస్ ఇంటికొలాయి మంజూరు చేయాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ఏపిఒ రోసిరెడ్డి, డిడి అన్నదొర, ఇఇ సింహాచలం, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటి డిఇఒ లిల్లీ రాణి, సిడిపిఒ రంగలక్ష్మి, పిహెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు : ఎస్‌పి

పార్వతీపురం రూరల్ : ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించే స్పందన కార్యక్రమ ఫిర్యాదులకు ప్రాధాన్యత నిచ్చి తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అధికారులను కోరారు. సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ(అడ్మిన్) కలిసి నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సమస్యలను ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోవాలన్నారు. సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి "స్పందన"లో స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మొత్తం 12ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఎస్బిసిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ వాసునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి గర్జనను విజయవంతం చేయాలి : కిమిడి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈనెల 10న జరిగే బొబ్బిలి గర్జన కార్యక్రమానికి కార్యకర్తలు శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకట్రావు పిలుపునిచ్చారు. సోమవారం బైపాస్ రోడ్డు టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ 10న బొబ్బిలిలో జరగబోయే తెలుగుదేశం పిలుస్తుంది కదలిరా అనే కార్యక్రమానికి బొబ్బిలి గర్జన పేరు నామకరణం ఖరారు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అశాంతితో ఉన్నారని ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పాటు అంగన్వాడీ, మున్సిపల్ ఔట్‌సోర్సింగ్, ఎస్ఎస్‌సి సిబ్బంది సమ్మెలు కొనసాగిస్తున్నారని అన్నారు. దీనికి కారణం ఎలాగైనా అధికారంలోకి రావాలనే కాంక్షతో ఎన్నికల ముందు వైఎస్ జగన్ అలవికాని హామీలతో ప్రజల్లో ఆశలు రేకెత్తించారని, అంతేకాకుండా కోడి కత్తి, బాబాయి మర్డర్ వంటి సంఘటనలు టిడిపికి ఆపాదించి అసత్య ప్రచారాలు చేశారని అన్నారు. నేడు ఆయన మాటలు సొంత చెల్లెలు కూడా నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ప్రజలు అనుకుంటున్నారని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బాబును సిఎం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం నియోజకవర్గ టిడిపి ప్రచారానికి సిద్ధం చేసిన ప్రజా రథం వాహనాన్ని ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో అరకు పార్లమెంటు ఇన్చార్జి కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, కొల్లి తిరుపతిరావు, బి.సీతారాం, పోల సత్యనారాయణ, బోను చంద్రమౌళి, కౌన్సిలర్లు బడే గౌరీ నాయుడు, కోలా సరితా మధు, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న తహశీల్దార్ రాములమ్మ

రేషన్ బియ్యం అందించాలని గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గోయిపాక పంచాయతీలో నవంబరు, డిసెంబర్ నెలల్లో గిరిజన సహకార సంస్థ ద్వారా రేషన్ బియ్యం, పంచదార, పప్పు తదితర సరుకులు అందడం లేదని గిరిజనులు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ రేషన్ బియ్యం, పంచదార, పప్పు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కితలాంబ, టంకు, రసాబడి, ఎస్టి గోయపాక గ్రామాలకు రేషన్ అందడం లేదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కార్యాలయం స్పందనలో ఫిర్యాదు చేయగా స్థానిక తహశీల్దార్ ఆధ్వర్యంలో కమిటీ వేసి విచారణ చేపట్టగా జిసిసి ద్వారా నవంబర్, డిసెంబర్‌లో ప్రభుత్వం డిసిసి ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అందడం లేదని విచారణలో తేలిందని తహశీల్దార్ చెప్పారు. ఈ విషయంపై రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్‌పైన, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ నివేదిక కలెక్టర్ కు పంపించామని తహశీల్దార్ తెలిపారు. నవంబర్, డిసెంబరు జిసిసి కోటా బియ్యం పూర్తిస్థాయిలో ఇప్పిస్తామని తహశీల్దార్ రాములమ్మ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్, సహాయ కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, కోశాధికారి మండంగి రమణ, నాయకులు సన్యాసిరావు, శంకర్రావు ఉన్నారు.

జగన్ పాలనలో జాబుల కొరత

ప్రజాశక్తి - పాలకొండ

ఆంధ్రప్రదేశ్‌కు జగన్మోహన్‌రెడ్డి సిఎంగా ఎన్నికైన తర్వాత ఆయన యువతకు చేస్తామన్న హామీలేవీ నెరవేర్చలేదని, ముఖ్యంగా 2లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయలేదని, ప్రతి ఏటా జనవరి ఒకటన జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ యువతను మోసగించారని అరకు పార్లమెంట్ అధ్యక్షులు వారాడ సుమంత్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎఒ సావిత్రికి తెలుగు యువత ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సంద్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాతంకంటే పైగా పట్టభద్రులు ఉన్నారంటే జగన్మోహన్ రెడ్డి ఈ ఆంధ్రప్రదేశ్లో యువతను ఎంత మోసగించారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. కాబట్టి యువతకు నిరుద్యోగ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని కోరుకుంటూ ఆర్డీవో కార్యాలయంలో ఎఒకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యువనాయకులు చొంగ శివానంద, సర్పంచులు అల్లు బుల్లిబాబు, వావిలపల్లి రమణమూర్తి, గురుబిల్లి చంద్రశేఖర్, గురుబిల్లి దిలీప్ తదితరులుపాల్గొన్నారు.

టిడిపి విజయం ఖాయం : నిమ్మక

ప్రజాశక్తి - సీతంపేట

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం భారీ మెజార్టీతో గెలుస్తుందని ఆ పార్టీ పాలకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ నిమ్మక జయకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో జయకృష్ణ మాట్లాడుతు వైసిపి ప్రభుత్వంలో రైతులు పూర్తిగా దగాపడ్డారని, అగ్రికల్చరల్, హార్టికల్చరల్ రంగం పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని సర్వే సంస్థలు 2024లో టిడిపి గెలుపు ఖాయమని అన్నారు. విలేకరుల సమావేశంలో బిసి సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఐటిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇమరక పవన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట సుధ, మూటక భరత్ రాజ్, మండంగి కుమార్, బిడ్డిక విశ్వనాధం, పువ్వుల భాస్కర్ రావు, మండల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో తరలి రావాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండల తెలుగుదేశం పార్టీ అత్యవసర సమావేశం ఎర్రన్న గుడి జంక్షన్‌లో పార్టీ అధ్యక్షులు అక్కేన మధుసూదన్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈనెల 10న టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు బొబ్బిలిలో తలపెట్టిన తెలుగుదేశం పిలుస్తోంది... రా.. కదలిరా సభకు మండలం నుంచి టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను జయప్రదం చేయాల్సిందిగా నాయకులను, కార్యకర్తలను కోరారు. సమావేశంలో మండల పరిశీలనగా నందివాడ గోవిందరావు, ముఖ్య అతిథిగా హాజరై పార్టీ తలపెట్టిన సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పురుషోత్తమ నాయుడు, ఎం.తవిటనాయుడు, ఎంబి విజయ అంకుశం, అంబటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గరుగుబిల్లి



లబ్ధిదారునికి పింఛను అందజేస్తున్న గిరి రఘు

పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. గరుగుబిల్లిలో ఎంపిపి ఉరిటి రామారావు అధ్యక్షతన సోమవారం ప్రభుత్వం పెంచిన వైస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం పెంచిన పింఛన్లతో పాటు, కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దశలవారీగా పింఛన్లు పెంపుపై ఇచ్చిన మాటను సిఎం జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టు కుందన్నారు. ఎంపిపి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేసిన ఘనత సిఎంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కలిశెట్టి ఇందుమతి, బొంతాడ మహేశ్వరరావు, కేతిరెడ్డి శిరీష, గులిపల్లి నారాయణమ్మ, ఎంపిడిఒ జి.పైడితల్లి, పిఎసిఎస్ అధ్యక్షులు బత్తల పకీరునాయుడు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని టౌన్ జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు అన్నారు. సోమవారం పదో సచివాలయం పరిధిలో ఉన్న 20, 21, 22 వార్డుల్లో పింఛను లబ్దిదారులకు రూ.3వేలు చొప్పున నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 20వవార్డు వైసిపి ఇన్‌ఛార్జి పిట్టా వాసుదేవరావు, 21వ వార్డు ఇన్‌ఛార్జి పిరిడి రామకృష్ణ, వైసిపి నాయకులు గిరి చిన్ని పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలతో మండల ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, వక్తృ చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు ఎంఇఒ ఆర్ ఆనందరావు తెలిపారు. వక్తృత్వ పోటీల్లో జి.దుర్గాప్రసాద్ (వీరఘట్టం) ప్రథమస్థానం, పి.కిషోర్ (వీరఘట్టం) ద్వితీయ స్థానం (తలవరం), తృతీయ స్థానం వి.లాస్యప్రియ, పి.పద్మ (వీరఘట్టం, కంబరవలస) సాధించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం ఎం.సంధ్యాన కుమారి (ఎంపియుపిఎస్ నడుకూరు), ద్వితీయ స్థానం టి.నిహారిక (జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్ కంబరవలస), తృతీయ స్థానం బి.జయదేవ్ (జడ్పీహెచ్ఎస్ స్కూల్ తలవరం) సాధించారు. అలాగే చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానం జై తేజశ్రీ (జడ్పీహెచ్ఎస్ స్కూల్ వీరఘట్టం), ద్వితీయ స్థానం ఎ.రుషి (జడ్పీహెచ్ఎస్ స్కూల్ కంబర వలస), తృతీయ స్థానం కె.ప్రమీల (జడ్పీహెచ్ఎస్ స్కూల్ వీరఘట్టం) గెలుపొందారు. వీరికి ఎంఇఒ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎ.వెంకటరావు, కుసుమకుమారి, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించి ఆదుకోవాలని గిరిజన సంఘం నాయకులు సోములు సంగం కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికీ అనేక గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేక విద్య, వైద్యం అందక చీకట్లో ఉండే పరిస్థితి ఉందన్నారు. కొమరాడ నుండి అంటి వలస, నయా పంచాయతీ సుంకేసు, దేరుపాడు, గుడ్డం, వనకాబడితో పాటు ఇంకా కొన్ని గ్రామాలకు రహదారి కల్పించడం లేదన్నారు. ఈ సమస్యపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు గిరిజనులు పెద్దఎత్తున కదలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, సోములు, సీతయ్య శంకర్రావు, చిలకమ్మ, గౌరమ్మ, పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

ధాన్యం మద్దతు ధరపై కలెక్టరేట్ వద్ద మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. సోమవారం జియ్యమ్మవలస తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని, రవాణా వాహనాలు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని, ధాన్యం పూర్తయ్యే వరకు పోక్యూర్‌మెంట్ కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

గాయత్రి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గల గాయత్రీ స్కూల్‌లో సోమవారం పాఠశాల కరస్పాండెంట్ పీవీకే మణికుమార్, ఆయన భార్య సరిత ఆధ్వర్యంలో విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలకు విద్యార్థిని, విద్యార్థులు తెలుగు సాంప్రదాయ దుస్తులను ధరించి హాజరయ్యారు. విద్యార్థిని, విద్యార్థులు హరిదాసు వేషధారణలు, భోగి మంటలు, గంగిరెద్దుల ఆటపాటలు, నృత్యాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ కరస్పాండెంట్ భోగి, సంక్రాంతి, కనుమ విశిష్టతను విద్యార్థిని, విద్యార్థులకు తెలియజేస్తూ ఆచార సాంప్రదాయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శ్రీ భారతి, జిల్లా



పాలకొండ: తమ్మినాయుడు కాలేజీలో సంక్రాంతి సంబరాలు జరుపుతున్న విద్యార్థులు



గాయత్రి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు జరుపుతున్న పాఠశాల కరస్పాండెంట్

పరిషత్ ఉన్నత పాఠశాలల్లో భోగి మంటలు వెలిగించి సంక్రాంతి ముందస్తు వేడుకను జరుపుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటల పాటలతో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, పంపిణీ చేశారు. విజేతలకు బహుమతులు అందజేసి విద్యార్థులకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. కార్యక్రమంలో ఎంఇఒలు సింహాచలం, శ్రీనివాస్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.జయప్రసాద్, బూరాడ జగన్, శ్రీనివాసరావు అజయ్ ప్రసాద్, తదితరులుపాల్గొన్నారు.

తమ్మినాయుడు విద్యా సంస్థల్లో...

పాలకొండ : పట్టణంలోని స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల ప్రాంగణంలో వారి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తమ్మినాయుడు విద్యాసంస్థల ప్రెసిడెంట్ ఎస్.నారాయణమ్మ, స్కూల్ ప్రిన్సిపల్ బి.కుమార్, కాలేజ్ ప్రిన్సిపల్ ఎ.తిరుపతి రావు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికమాత్రల మింగి యువకుడు మృతి

మక్కువ : మండలంలోని కన్నంపేటలో మోతాదుకు మించి మాత్రలు వినియోగించడంతో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్సై నరసింహమూర్తి తెలిపిన వివరాలు ప్రకారం దత్తి మాధవరావు (29) తన తల్లితో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యం పాలైన మాధవరావు విశాఖలోని హాస్పిటల్లో వైద్యులు సూచన మేరకు మందులు వాడుతున్నాడు. ఈనెల 2న రోజువారి వేసే మాత్రల కంటే అధికంగా వేయడంతో అపస్మారస్థితికి చేరుకున్నాడు. దీంతో తల్లి సాయమ్మ గుర్తించి ఆసుపత్రికి తరలించారు. కెజిహెచ్‌సిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తల్లి సాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు .

వృద్ధ కళాకారుడికి ఘన సన్మానం

బలిజిపేట : మండలంలోని మిర్తివలస డిపిఇపి పాఠశాలలో సోమవారం వృద్ధ కళాకారుడు చాకరాపల్లి ఈశ్వరరావుకు ఆ పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. వృద్ధుడిగా ఉంటూ తన కలలను ప్రతి పాఠశాలలో కొనసాగిస్తూ సుమారు 400కు పైగా ప్రదర్శనలు ఇవ్వడంలో సంతృప్తి ఉందని పాఠశాల సిబ్బంది అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శావా కప్పి సన్మానించి పుష్ప గుచ్చాలు అందించారు.

నాణ్యమైన విద్యే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం



విద్యార్థులకు ట్యాబులు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యను అందించడమే ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి అన్నారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాల వద్ద 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి పేద విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ముఖ్యమంత్రి లక్ష్యమని రూ.40 వేలు విలువ చేసే బైజుస్ ట్యాబులను ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందిస్తున్నారని కావున ప్రతి విద్యార్థి సక్రమంగా చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి. సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, తహిసిల్దార్ ఆర్. రమేష్ కుమార్, ఎంఇఒ ఎన్. సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, పలువురు ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.